# ఒక చలిరాత్రి

చలి. ఎముకలుకొరికే చలి. కాలు కింద పెడితే వున్ని మేజోళ్ళనుంచి విద్యుచ్ఛక్తిలా పైకి పాకుతోంది. శాలువ పైకి లాక్కున్నకొద్దీ ఎక్కువ అవుతోంది. చేతివేళ్ళు కొంకర్లు పోతున్నాయి. కళ్ళు మసకబారుతున్నాయి.

సోమయాజులు పుస్తకం మూసి, శాలువ చేతులనిండుగా కప్పుకున్నాడు. ఇంతలో 'ధన్' మని శబ్దం చేస్తూ కిటికీతలుపులు తెరుచుకున్నాయి. అవి మూసేందుకు లేచిన అతను మరింత ఒణుకుతున్నాడు. బైట వాన చినుకులు పడుతున్నాయి. ఆ చలిలో యిక వానకూడా కలిస్తే చెప్పనే అక్కరలేదు! కిటికీల కొక్కెలు పెట్టేందుకు అతని వేళ్లు బిగుసుకున్నాయి.

అది జనవరి మాసం – అందులోనూ మబ్బు పట్టిన రోజు. రాత్రి తొమ్మిది దాటాక సాధారణంగా రోడ్డుమీద ఆట్టే మనుష్యులు వుండరు. ఢిల్లీలోని అక్బరు రోడ్డు అయితే యిక సరే సరి! వాతావరణం అతి ప్రశాంతంగా వుంది. చినుకుల చప్పుడు తప్ప మరే శబ్దం వినిపించటం లేదు.



ఒక్క క్షణం సోమయాజులు దృష్టి కింద పోర్టికోమీద నిలిచింది. వరండా లోని మెర్క్యురీ దీపం కాంతి పడి నీలంబ్యూక్ ధగధగ మెరుస్తోంది. వాన చినుకులకి ఉక్కిరి బిక్కిరయి ఆకులు పువ్వులు తెగ వూగిపోతున్నాయి. గేటు దగ్గిర చలిమంట కాచుకుంటున్న నౌఖరు కారుని షెడ్డులో పెట్టేందుకు పరిగెత్తుకు వస్తున్నాడు.

సోమయాజులు యింకా అలా నిల బడే వున్నాడు. ఆతని మనసు ఎంతో నిండుగా వుంది ఇవాళ. వెచ్చని తలు పులు–తృప్తిగా ఒక నిట్టూర్పు–అతన్ని క్షణకాలం చుట్టుముట్టాయి. ఎంత చల్లనిది తన జీవిత రేఖ? ఎంత కరుణా మయుడు భగవంతుడు? అతని కళ్ళు ధగధగ మెరుస్తున్నాయి. పైపు వెల గించి ఆలోచిస్తున్నాడు. అనుకోకూడదు గానీ తనపాటి అదృష్టం మ రెవరికి తగిలింది? హోదా గల సర్కారు వుద్యోగం, అనుకూలవతి అయిన భార్య, పండంటి పిల్లలు, సంఘంలో పేరు ప్రతిష్ఠలు, తనింత తిని పదిమందికి పెట్టగల స్తోమత ... పచార్లు చేస్తూ అద్దంలో తన ప్రతిబింబం చూసుకు న్నాడు. ఉంగరాలజుత్తు అక్కడక్కడా నెరుస్తోంది. ముఖంమీద ముడతలు లేవు గానీ, ఆ కళ్ళజోడు వయసుని బైట పెడుతోంది. ఐనా మంచి ఒడ్డూ, పొడవూ. ఐనా తను నలభయ్యోపడిలో వున్నట్లు ఎవరు తెలుసుకోగలరు? సోమయాజు లుకి కొత్త హుషారు పుట్టుకొచ్చింది.



నవ్వుకుంటూ రేడియోగ్రాం తిప్పాడు. సన్నగా పాశ్చాత్య సంగీతం వస్తోంది

అసలు పిల్లలు సరిగా చదువుకుంటున్నారో లేదో చూసిపెడదాం. ఈ మధ్య ఆదిలక్ష్మి పోరు పెడుతోంది. వాళ్ళని కాస్త కనిపెడదామని అనుకుంటూ సోమయాజులు కిందికి వెళ్ళాడు

మెట్లు, ముందరి పెద్ద హాలులోకి దారి తీశాయి. దానికి ఇరువైపులా పెద్ద గదులూ, ముందు మరో గదీ వున్నాయి పిల్లలు ఆ ముందుగదిలో గుమికూడటం చూసి, "ఇక్కడేం చేస్తున్నారు?" అంటూ సోమయాజులు వెళ్ళాడు

"నాన్నా' మరేం ఎవరో వానలో తడుస్తూ మన గేటుదగ్గిర నిలబడ్డారు. లోపలికి పిలుద్దాం," పదేళ్ళ కమల తండ్రి ఒంక ఆశగా చూసింది.

''కుక్కగానీ వుందేమో యని వాళ్ళు సందేహిస్తున్నారులా గుంది నే వెళ్ళి పిలవనా?"

చొక్కా గుండీలు సరిచేసుకుంటూ, తండ్రి అనుమతి కోసరం ఎదురు చూస్తున్నాడు పెద్దకొడుకు రామం

''వర్షంలో నువ్వు తడవకు; రంగణ్ణి పిలవమను," సోమయాజులు హాల్లోకి కదిలాడు. భార్య ఆదిలక్ష్మి అతని కెదురయింది

''ఏరండీ పిల్లలు? ఏమయిందక్కడ? కమల పాలు తీసుకోనే లేదు," అన్నది.

పచ్చని పసిమి, జారుముడితో పెద్ద తలకట్టు, అందులో మల్లెచెండు, ఎర్రని కుంకుమ బొట్టు, పొట్టిగా, ఒళ్ళు పొందిగ్గా లక్ష్మీకళ వుట్టిపడుతోంది ఆమెలో

ఆ వచ్చినవా ళ్ళెవరో వరండాలోనే ఆగారు. మరి లోపలికి రాలేదు. పిల్లలు కిటికీలోంచి వాళ్ళని చూస్తూ ఏదో చెప్పుకుంటున్నారు ఆదిలక్ష్మికూడా గుమ్మంలో నిలబడింది. మెట్లెక్కబోతున్న భర్త నుద్దేశించి అంది·

"పాపం! వుత్తిమనిషికూడా కాదు. ఎవరో పర ప్రాంతాల వాళ్ళలాగే వున్నారు. కాస్త లోపలికి పిలవకూడదూ?"

'సరే' అన్నట్టు సోమయాజులు భార్యవంక చూశాడు వెనక్కి తిరుగుతున్న అతనికి లీలగా ముందుగదిలోకి వస్తూన్న వాళ్ళు కనబడ్డారు. వయసులో వున్న నవదంపతులులా గున్నారు. స్త్రీ కిలకిలా నవ్వుతోంది. అతను చేయి అందిస్తూ ఆమెని లోపలికి తెస్తున్నాడు. వా ళ్ళిద్దరికీ చుట్టుపక్కల ఎవరున్నదీ అవసరం లేదులాగుంది దుస్తుల్ని బట్టి వా ళ్ళైమంత భాగ్యవంతులు కారనిపిస్తుంది. అతని కోటు మాసివుంది. ఆమె ఒక మేతకరకం ఆకుపచ్చ నేతచీర కట్టుకుని వుంది. పైన ఒక నల్లస్వెట్టరు. అతను నల్లగా, బొద్దుగా ఓ రకం గుమాస్తాలా వున్నాడు ఆమె సన్నగా, చామనచాయగా, ఒంటికి అతుక్కుని వున్న చీర ఆమె తల్లి కాబోతుందన్న



రహస్యం బైట పెడుతోందా అన్నటు వుంది. నాలుజడలోంచి మల్లెలు గుబాళిస్తున్నాయి. చేతినిండుగా పట్టుగాజులు, కుడిచేతిలో చిన్న పర్సు; భర్తమీదుగా వాలిపోతూ పకపక నవ్వుతున్న ఆమెని మరొక్కసారి పరీక్షగా చూశాడు సోమయాజులు.

అతనిగుండె దడదడ కొట్టుకుంది. సందేహం లేదు. తనకళ్ళు మరీ అంత పాడవలేదు. నుంచున్నచోటునే ఆగిపోయిన అతనిముఖం రంగులు మారింది. పిల్లలు ఎవరిగదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. ఆదిలక్ష్మి వంటింటి వైపు నడిచింది.

హాలులో కిటికీకి ఇవతలగా నిలబడి వాళ్ళని చూస్తున్నాడు సోమయాజులు. ఆ స్త్రీ కుచ్చెళ్ళ అంచు పిండి ఆరుబెట్టుకుంటోంది. అతను జేబులోంచి పెద్ద రుమాలు తీసి ఆమెతల తుడువటానికి ప్రయత్నిస్తున్నాడు. మళ్ళీ కిలకిలనవ్వు. ఆమె ఇటుగా తిరిగినప్పుడు దీపం వెలుగులో ముఖం స్పష్టంగా కనబడుతోంది. చెవులకి సన్నని రింగులు, మెళ్ళో నల్లపూసలు, పల్చని పెదిమలు, చురుకైన

కళ్ళు, కోలగా అతి నాజూకుగా వుంది ముఖం. రవంతయినా మార లేదు. పైపెచ్చు యింకా చిన్నదానిలా కనపడుతోంది; నవనాగరీకపు ఛాయ లొచ్చాయి.

సోమయాజులు తలుపు వెనకాతలగా నక్కాడు. వాళ్ళిద్దరినీ రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. పేము కుర్చీలో కూర్చుంది ఆమె. భర్త తివాసీమీద కూలబడి, ఆమె కాళ్ళదగ్గిరగా జరిగాడు. సన్నసన్నగా ఆమె ఏదో అంది. ఇద్దరూ మళ్ళీ గొల్లున నవ్వారు. అలా నవ్వుతున్నప్పుడు ఆమె తల విదిలింపుగా వెనక్కివాలింది. చటుకున ఆమె కిటికీవైపు తిరిగి చూసింది. సోమయాజులు ఒక్కుదుటన అక్కడినుంచి యివతలకి వచ్చేశాడు.

"ఛీ!" తనని చూసిందా? చూస్తే గుర్తు పడుతుందా? అయితే ఏం? తన కేం తక్కువ? ఇలా తనయింట్లో తలదాచుకున్నందుకు కృతజ్ఞత తెలుపుతూ ఒంగి నమస్కారం పెడుతుంది. భర్తచేతా పెట్టిస్తుంది. సోమయాజులు ముఖంమీద చిన్న హాసరేఖ చిందింది. అవును; తను వాళ్ళని ఇంకా లోపలికి రమ్మని పిలుస్తాడు. మంచిసోఫాలో కూర్చోమంటాడు. కార్లో యింటిదగ్గిర దింపేస్తాడు! ... కానీ...దానిబదులు తన కిప్పుడు వాళ్ళని దొంగతనంగా కిటికీ ఇవతల నిలబడి చూడాలని వుంది. దీపం ఆర్పేస్తే తనక్కడ వున్నట్లు ఎవరికీ తెలియదు కూడా!...ఛీ!...తన యింట్లోనే తను దొంగలాగా ప్రవర్తించటమా? ఏం ఖర్మ! అసలీ గొడవంతా ఎందుకు — హాయిగా పైకెళ్ళి వెచ్చగా పడుకోక?... సోమయాజులు తటపటాయించాడు. అతనిముఖం ముచ్చెమటల్తో నిండింది. పెదిమలు ఒణుకుతున్నాయి. అనుకోకుండానే అతనివేళ్ళు దీపం ఆర్పేశాయి.

ఇప్పుడు సోమయాజులు ఒకబందీ. క్షణంక్రితం అనుభవించిన సౌఖ్యం, స్వాతంత్ర్యం పోయినా, ఒక అల్ప ఉద్రేకానికి బానిస. ఆ చలిలో, కిటికీలోంచి కళ్లు పొడుచుకు చూస్తున్నాడు. ఆనందం బదులు అపజయం; తృప్తి బదులు అసూయ; నిశ్చింత బదులు అనుమానం అతని ముఖాన్ని ఆవరించాయి. కళ్ళజోడు సరిచేసుకుంటూ అతను గోడ పట్టుకుని నిలబడ్డాడు. ఈ సమయంలో హాలులో ప్రవేశించేవా రెవరైనా అతన్ని ఒక చోరుడికింద జమకడతారే గానీ ఆ యింటికీ, సౌభాగ్యానికీ అధిపతి అనుకోరు.

* * *

పక్కగదిలోని దీపం ఆరిపోవటంతో భర్త ఆమెకి దగ్గిరగా జరిగాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని నెమ్మదిగా ఏదో అడిగాడు. ఆమె ఒంగి అతని జేబులో పెన్ను సర్దింది. జేబులోంచి రెండుటిక్కట్లు పైకి వచ్చాయి. ఏ సినిమాకో, నాటకానికో వెళ్ళవస్తున్నారు లాగుంది! టిక్కట్లని అటూ ఇటూ

తిప్పుతూ యిద్దరూ ఏదో మాట్లాడు తున్నారు. ఆమెముఖం వెయ్యిదీపాల వెలుగు ప్రసరిస్తోంది. ఆమె చూపులు భర్తనుండి ఒక్కక్షణమైనా తిప్పటం లేదు. ఆమె కుడిచెయ్యి అతని ముంగు రుల్ని సర్దింది. ఉన్నట్లుండి కనుబొమలు ముడిపడ్డాయి. పెదిమలు విరిచింది. తల తుడుచుకోమని అతన్ని బ్రతిమాలు తోంది. అతను బెట్టుచేస్తూ దూరంగా జరుగుతున్నాడు.

సోమయాజులు కాలికింద భూమి కొద్దిగా చిట్లినట్లయింది. కాంతం ... ఎప్పటికాంతం...ఎన్నడయినా కాంతం తనకి యిలా ఎదురవుతుందని అను కున్నాడా? గతం తాలూకు అనేక ఘట్టాలు అతని కళ్ళయెదుటకి రాసా గాయి – మనసుని పులకింపజేసే ఘడి యలు, కళ్ళు బరువెక్కించే సుందర దృశ్యాలు, హృదయాన్ని వూపివేసిన అనుభూతులు...అన్నీ ఎంతో పదిలంగా అతని హృదయాంతరాళంలో చోటు చేసుకునివుండి, యిప్పుడు పైకి ఎగసి పడుతున్నాయి. సోమయాజు లెన్నడూ అనుకోలేదు–అవి ఇలా తడుతూనే ఎదుట వచ్చి నిలబడుతాయని.

*　　*　　*

సోమయాజులు కాలేజీలో చదువు తున్న రోజు లవి. బి. ఏ. పూర్తవుతూనే అతనికి కలెక్టరుద్యోగ మవుతుం దనీ, బోలెడు కట్న కానుకలతో కోడలు రానే వస్తుందనీ కలలు కంటున్నారు తల్లి తండ్రులు – మరి సుపుత్రుడు ఒక్కడే నాయె! తతిమ్మా అంతా ఆడపిల్లలు! గుంటూరులో యింకా పట్నవాసపు ఛాయలు రాలేదని అతన్ని మద్రాసుకి చదువుకి పంపారు.

హాస్టలులో భోంచేస్తూ, చదువుకి తల వేడెక్కి, కొడుకు చిక్కిపోతున్నా డని తల్లి అస్తమానం పోరుపెట్టేది. ఆరో గ్యము జాగ్రత్త అనీ, వూళ్ళో బంధువు లింటికి వెళ్ళి తరుచు విశ్రాంతి తీసుకో మనీ ప్రతి వుత్తరంలోనూ రాసేవాడు తండ్రి. కానీ నిజానికి సోమయాజులు తరహాయే వేరు. అతను మద్రాసు చేరిన కొద్దిరోజులలోనే కాఫీ, సిగరెట్లు అల వాటు చేసుకున్నాడు. హోటళ్ళలో చిరు తిళ్ళు ప్రారంభించాడు. బంధువుల పేర్లు, చిరునామాల పట్టీ పెట్లో మూలుగుతుం డేది. అతను తరుచు విశ్రాంతి తీసుకునే స్థలాలు – సినిమాహాళ్ళు, బీచీ, క్లబ్బులు తండ్రి పంపేడబ్బుతో ఎక్కువగా నవ లలు, కథలపుస్తకాలు కొనేవాడు మంచి దుస్తులమీదా, ఆరోగ్యంమీదా అతని కెన్నడూ శ్రద్ధ ఏర్పడలేదు. శలవుల్లో యింటిదగ్గిర గడిపే నాలుగురోజులూ గందరగోళంగా వుండేవి అతనికి. ఎప్పు డెప్పుడు తన స్వంతగూటికి వెళ్ళిపో దామా అని తొందరపడేవాడు.

హాస్టలులో అలజడీ, సమ్మెలూ జరి గిన సందర్భంలో సోమయాజులు చిం

తాద్రిపేటలో ఓ చిన్నగది అద్దెకు తీసు కున్నాడు హోటలుకి దగ్గిరిగా, బజారు వీధిలో అనుకూలంగా వుంది గది నియ మానుసారం జీవితానికి కట్టుబడలేని సోమ యాజులకి ఆ గది మరింత ఆనందాన్ని చ్చింది. చదువుకూడా బాగానే సాగు తోంది పాసుమార్కులు తెచ్చుకుంటూ పరీక్షలు నెగ్గుకొస్తున్నాడు

ఆ ఇల్లు గలాయనది పెద్దకుటుంబం. వచ్చే పోయే బంధుకోటీ ఎక్కువ. పైనగదిలో వుంటున్న సోమయాజుల కది బాధ అనిపించకపోయినా, మెట్లు దిగివస్తున్నప్పుడు తరుచు అతనికి మను ష్యులు ఎదురయ్యేవారు. అలా ఓ రోజు అతనికి కాంతం కనపడింది. ఆ పిల్ల కప్పుడు పద్దెనిమిదో ఏడు. పెద్ద వాలు జడ, సన్నగా, పొడ్డుగ్గా ఆకర్షణీయంగా వుంది. సోమయాజుల్ని వాలుగా చూసింది కాంతం. అతను మరొక్క సారి కాంతాన్ని తిరిగి చూశాడు. ఆ రోజునుంచీ కాంతం అతనికి తరుచు, వరండాలోనో, పైన డాబామీద బట్టలు ఆరేస్తూనో లేక గుమ్మం దగ్గిరో కన పడేది. అతనూ కాలేజీ అవగానే తిన్నగా గదికి వచ్చేస్తున్నాడు.


పక్కింటి సంగీతం మాష్టారి నాలుగోకూతురు కాంతం. ఆయనకి మొత్తం ఆరుగురు ఆడపిల్లలు సంపా దన యింటికే చాలక అవస్థపడుతున్న ఆ బ్రాహ్మడు, ఆడపిల్లల పెళ్ళిసమస్యతో యింకా చిక్కి శల్యమయి వున్నాడు ఇద్దరమ్మాయిలకి ఎలాగో తంటాలుపడి పెళ్ళి అయిందీ అనిపించాడు. మూడో కూతురికి మాట సరిగారాదు అందుచేని పూర్తి యింటిపనుల్లోనే వుంచాడు. ఇక నాలుగోది కాంతం; ఇద్దరు చిన్నపిల్లలు

కాంతం స్కూలుఫైనలు ప్యాస యింది వసకీ, గాలికీ వూగుతున్న పెంకుటింట్లో విసిగి, పక్కింట్లో ఎక్కువ కాలం గడిపేది ఆ పిల్లకీ యిల్లుగలా యన కూతుళ్ళకీ మంచిస్నేహం. ఈ భోగట్టాఅంతా సోమయాజులు స్వయానా సంగీతంమాష్టారి నోటనే విన్నాడు

ఇప్పుడు సోమయాజులు ఆయనతో పరిచయం చేసుకున్నాడు. వెచ్చని పరుపుమీద పడుకుని, నూరునెంబరు బల్బు వెలుతురులో "ఆకలి", "స్వార్థ త్యాగి", ''బలిదానం'', "ఆశయాలు"- లాటి కథలు చదివి ఏంలాభం! వాస్తవ జీవితంతో తనకు ఏపాటి పరిచయం వుంది? తన తోటిమనుష్యుల జీవితాల్ని గురించి తనకు ఏమాత్రం తెలుసు? అని ఆలోచించాడు.

సోమయాజులు అసలిప్పుడు అతిగా పుస్తకాలు చదవటం కట్టిపెట్టి, నలుగు రితో మాట్లాడుతున్నాడు. వాళ్ళయిళ్ళకి వెళుతున్నాడు వాళ్ళని గురించి ఆలో చిస్తున్నాడు.

''నాయనా! మేము ఈ అరవదేశంలో పడివున్నాము. మన ఆంధ్ర ప్రాంతాల




కాంతాని కేదయినా మంచి అబ్బాయిని చూద్దూ ! నీకు తెలుసుగా. నేను బిద వాణ్ణి,'' అని ఓ రోజు మాష్టారు కళ్ళు తడిచేసుకున్నప్పుడు సోమయాజులుకి జాలివేసింది. అతని మెదడులో తళుక్కున ఒ ఆలోచన తట్టింది.

కాంతం చాలా గడుసుది. ఎక్కువ మాట్లాడదుగానీ అన్నీ కనిపెట్టేది. పక్కింటి విద్యార్థి తన తండ్రికోసరం తరుచూ రావటం, తనవంక కుతూహలంగా చూడటం — యివన్నీ గమనించింది. కానీ సోమయాజు లంతగా బైట పడలేదు. అతను నొక్కి నొక్కి ప్రశ్నిస్తే, ఒక్కముక్కలో జవాబు చెప్పేది. జడ తిప్పుకుంటూ వెళ్ళిపోయేది. తను పలకరించిందే తడవుగా ఆపిల్ల బేలగా తనముందు నిలబడుతుందనుకున్న సోమయాజుల కిది ఆశాభంగాన్నే కలిగించింది. అంతేకాదు ? ఆమె పట్ల కుతూహలం, ఆకర్షణ ఎక్కువకాసాగాయి

ఒకరోజు ఎవరూ లేకుండా చూసి చొరవచేశాడు సోమయాజులు.

“మీకు నా మీద ఎటువంటి అభిప్రాయమున్నా ముందు మా నాన్నగారితో మాట్లాడండి.' అంటూ తళుక్కున సమాధాన మిచ్చింది కాంతం

ఆ పిల్లకి తనమీద ఎంతమట్టుకు ఆశ వుంది ? నిజానికి కాంతం ఒప్పుకుంటే తనకు యింతకంటే మంచిభార్య దొరుకు

తుందని ఏమిటి ? కాంతం మాటా, తీరూ, మనసూ, భావం తెల్సుకుని ఆమెతో పరిచయం చిరస్థాయి చేసుకుంటే తను అదృష్టవంతుడే ? జీవితంలో ఒక ఆశ యము నిలుపుకున్నవా డవుతాడు. ఒక మంచికార్యం చేశాననే తృప్తి మిగులు తుంది. ఇలాటి భావాలే ఓరోజు అతన్ని కాంతం గుమ్మందగ్గిరకి లాక్కెళ్ళాయి.

"నా చదువు పూర్తయేందుకు యిక ఆర్నెల్లు. తల్లిదండ్రుల్ని ఎంతయినా, ఎదిరించి మీ అమ్మాయిని చేసుకుం టాను," అని ఖచ్చితంగా చెప్పేశాడు పెద్దవాళ్ళకి.

ఆ రోజున సంగీతం మాష్టారియింట్లో పండుగంత సంబరం జరిగింది. మరి అలాటి సంఘటన ఎన్నడూ జరిగి వుండలేదు ఆ కుటుంబంలో. కాంతం తండ్రి సంతోషం పట్టలేక ఉక్కిరి బిక్కిరి అయాడు. తల్లి దేవుడికి దణ్ణం పెట్టుకుంది. కాంతం మటుకు కొంగుతో ముఖం కప్పేసుకుంది.

"నీకు ఈ అబ్బాయి నచ్చాడా ?" అని యింట్లో ఎవ్వరూ కాంతాన్ని అడి గిన పాపాన పోలేదు. పైపెచ్చు అత నికి "ఈ వూరగాయ యిచ్చారా!" "రేపు ఇక్కడ భోంచేయమని చెప్పు." అని పురమాయించసాగారు. ఒక రోజు కాంతాన్ని ఒంటిగా పట్టుకుని నిలదీశాడు సోమయాజులు.

"కాంతం ; నేనంటే యిష్టమేనా ?" అనడిగాడు.

"అ యిష్టాలన్నీ నాకు తె" అంది ముక్తసరిగా.


"పోనీ యిలా నాతో మాట్లాడి యింకాస్సేపు యిక్కడ వుండ పిస్తోందా ?" సోమయాజులు గొంత పోయింది.

కాంతం అతని కళ్ళల్లోకి సు చూసింది. చిన్నగా నవ్వుతూ తల ది కుంది. సోమయాజు అప్పుడు ఈ భూమ్మీద నిలవటంలేదు చటుక్కున కాంతాన్ని తన చేతుల్లోకి తీసుకుని ఆ కళ్ళవంక పదే పదే చూశాడు అదే ప్రారంభం వాళ్ళిద్దరి నిజ పరిచయం.

ఆ ఆరు నెలల్లో వాళ్ళిద్దరూ చాలా మాట్లు కల్సుకున్నారు – కొంత పెద్ద వాళ్ళకి తెలిసీ, కొంత తెలియకా. సోమ యాజులంటే కాంతానికి పెద్ద గౌరవం, మమకారం ఏర్పడ్డాయి అతనికీ కాంతం మీద మోజు ఎక్కువ కాసాగింది. పూర్ణిమనాటి రాత్రి కాంతం అతని ఒళ్ళో తలవాల్చి పడుకోవటం, ఆ పిల్లకి యిష్ట మైన గులాబీరంగు గాజులు అతను తేవ టం, కపాలేశ్వర గుళ్ళో యిద్దరూ దేవు డికి దణ్ణం పెట్టుకోవడం – యిలాటి వెన్నో జరిగాయి.

* * *

పరీక్షలు పూర్తయి సోమయాజులు యింటికి బయలుదేరాడు. మధ్యాహ్నం పంన్నెండుగంటలకి రైలు. సామాన్లవీ యింకా సర్దలేదు. ఉదయంనుంచీ అతను



"నీవు డైవర్స్ ఒప్పుకుంటావా ?"
"నేను పెళ్ళే ఒప్పుకోను !"

పక్కింట్లోనే కూర్చునివున్నాడు. కాంతం కళ్లు బాగా ఉబ్బివున్నాయి రెండు నెలల్లో తిరిగి వస్తాననీ, వారం వారం జాబు రాస్తాననీ, యిక ముహూర్తం పెట్టేయొచ్చనీ అతను ఎన్ని విధాల చెప్పినా కాంతం కళ్ళు తుడుచుకుంటూనే వుంది

ఇల్లు చేరాక సోమయాజులు మనస్సు చాలా గజిబిజిగా తయారయింది. ''పిల్లని చూడు – పెళ్ళి చేసుకో'' అన్న నినాదాలు ఎక్కువయాయి మద్రాసులో తను ఒకమ్మాయికి మాట యిచ్చాననీ, పెళ్ళివిషయంలో పూర్తి స్వతంత్రం కావాలనీ కొడుకు చెబ్తుంటే, తన తలితండ్రులకి మూర్ఛ వచ్చినంత పనయింది అచేతనంగా నిలబడ్డవాళ్లు ఆశ్చర్యంగా తేరుకున్నారు కొడుకు గుంటూరు పొలిమేరలు దాటకుండామటుకు జాగ్రత్త పడుతూవచ్చారు

పరీక్ష ఫలితాలు రానే వచ్చాయి. సోమయాజులు మూడోక్లాసులో బి ఏ ప్యాసయ్యాడు పెళ్ళిమాట వాయిదా వేస్తూ అతను ఉద్యోగాన్వేషణ ప్రారంభించాడు కనీసం పిలుపయినా రాని ఉద్యోగాల సంఖ్య అలా వుండగా, కొన్ని చేతిదాకా వచ్చి కిందపడిపోయినై.

* * *

కాంతానికి ఉత్తరాలు రాస్తూనే వున్నాడు. రోజులూ, వారాలూ గడుస్తున్నాయి అతనికి ఉద్యోగ తాపత్రయం మహాపట్టుకుంది ఈ ఆసరా దొరికితేగానీ తనింకేమీ సాధించలేడు. తన స్వాతంత్ర్యానికి అర్థంకూడా లేదు జీవితంపట్ల అదో రకమైన విసుగు ప్రారంభ

మయింది. ఈ మానసికావస్థలో వుండగానే తండ్రి ఓ రోజు యిలా అన్నాడు.

"చూడు సోమూ! దుర్గాప్రసాదని రిటైర్డు డిప్యూటీ కలెక్టరు నాతో వియ్యమందాలని సంబర పడుతున్నాడు. కూతురా చందనపు బొమ్మ! స్కూలు ఫైనలు వరకూ చదువుకుంది. వాళ్ళకా - ఇల్లూ వాకిలీ, భూమీ గట్రా అంతా ఈ పిల్లే. నీకు పిల్ల నచ్చిందా దుర్గాప్రసాదుకి కొడుకూ, అల్లుడూ నువ్వే. ఇక్కడా అక్కడా ఏమిటి, ఏకంగా ఢిల్లీలోనే మంచి వుద్యోగం వేయిస్తాడు. అన్ని విధాలా ఆలోచించుకో;" బోధించాడు తండ్రి.

సోమయాజులుకి ఆలోచించుకునేందుకు బోలెడంత వ్యవధి - ఇప్పుడు పరీక్షలు లేవు. వేరే వ్యాపకం లేదు. నవలలూ, పుస్తకాలూ ఎంత సేపని చదవటం? తువ్వాలు బుజంమీద వేసుకుని, పైకప్పుకేసి చూస్తూ, ఈజీ ఛైరులో కూర్చున్న అతనికి తండ్రి మాటలు పదేపదే కొత్త అర్థాలతో మారుమ్రోగుతున్నాయి. గతంలోని అనేక భావాలు, ఆశయాలు దూదిపింజల్లా ఎగిరిపోతున్నాయి. తన ప్రస్తుత పరిస్థితి అతిదారుణంగా, కరుణామయంగా తోచింది అతనికి. చిన్న పెట్టె, బెడ్డింగు తీసుకుని తను మద్రాసు వెళ్ళటం గుళ్ళో కాంతంతో పెళ్ళి, చింతాద్రిపేట ఇరుకుసందులో కాపురం, చిల్లరదుకాణంలో తన గుమాస్తాగిరీ - ఈ దృశ్యాలు అతన్ని కలవరపరిచాయి. 'మాట యిచ్చావు. నిజమే. ఎవరికి? ఎటువంటి పరిస్థితిలో? ఇలాటివి రోజూ ఎన్ని జరగటం లేదు. వేరే పిల్లని చూసినంత మాత్రాన మునిగిం దేమిటి?' అతనిలో అనేక ప్రశ్నలు ఉదయించాయి.

ఆదిలక్ష్మిని చూశాక, సోమయాజులలో వున్న కాస్త బెట్టు సడలిపోయింది. కాంతం స్మృతినీ, తన మాట యొక్క బరువునీ, వ్యక్తిత్వపు విలువనీ అతను తూచసాగాడు. తల్లి తండ్రుల చాటున, సంఘటన పేరిట, పరిస్థితుల అడుగున వాటిని మార్చి మార్చి చివరికి పెళ్ళికి ఒప్పుకునేందుకు అతను ఏమంత శ్రమపడ నవసరం లేకపోయింది. ఓ శుభముహూర్తాన ఆదిలక్ష్మితో అతని వివాహం అయింది. నెల తిరక్కుండా ఢిల్లీలో వుద్యోగమూ అయింది. బీరువాలో అడుగున పడివున్న కాంతం వుత్తరాలు ఎప్పుడో చింపేశాడు సోమయాజులు. ఆమె ఏమయిందీ? ఎక్కడున్నదీ? తెలుసుకునేందుకే ఆ తరువాత అవకాశం చిక్కలేదు.

* * *

వాన ప్రారంభమయి చాలా సేపయింది. కాంతం కుర్చీకి జారగిలి కళ్ళు మూసుకునుంది. భర్త తనపై కోటు తీసి ఆమెకి కప్పాడు. వాహన మేదయినా దొరుకుతుందేమో చూసేందుకు వరండాలోకి వెళ్ళాడు.

సోమయాజులకి ఆమె నొక్కసారి

పిలవాలనిపించింది. ఎన్నో అడగాలని మనసు ఆరాటంగావుంది. కానీ ఎంత తృప్తి ఆముఖంలో? ఎంత నిండుతనం ఆ విగ్రహంలో? ఈ సమయంలో ఆమెని పలకరించటం భావ్యమేనా? ఎదుట పడటం అవివేకం కదూ?

ఆమె తాలూకు జ్ఞాపకాలు విడవని దురదృష్టవంతుడు తను. కానీ కాంతం మరచిపోయివుంటుంది. అంత హాయిగానూ కనుపిస్తోంది. సోమయాజులు గుండెలో ఏదో బలంగా గుచ్చుకున్నట్లయింది.

బైట ఆటోరిక్షా ఆగిన చప్పుడయింది. భర్త కాంతాన్ని లేపేందుకు వచ్చాడు. ఇద్దరూ ఒకరిమీద ఒకరు వాలిపోతూ బైటికి నడిచారు; కాంతం మళ్ళీ కిలకిలా నవ్వుతోంది.

సోమయాజులు దీపం వేశాడు. గదిలోని ప్రతి వస్తువూ మరింత వెలుగుతో అతనికళ్ళకి కొడుతోంది. అతను కళ్ళు చిట్లిస్తూ మూసుకున్నాడు. ఎంత వెలుగు చుట్టూ! ఎంత సంపద తన చేరువన! ఎన్ని విజయాలు సాధించాడు ఈ జీవిత కాలంలో! కానీ ఎంత అశాంతి ఈరోజు! 'అభాగ్యుణ్ణి' నేను అనుకుంటూ వాపోయాడు సోమయాజులు.

